క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక

తాడూరు: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ మండల నాయకుడు చంద మల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన రాజు, యాదయ్య, ఆంజనేయులు, రమేష్, మల్లేష్, బాల్‌చందర్‌లతో పాటు మరో 20 మంది కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో యార కోటేశ్వర్ పాల్గొన్నారు.

మైనార్టీ మండల కమిటీ ఎంపిక



తాడూరు: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ మైనార్టీ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా రియాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా సాబేర్, షేక్‌వాల్మియా, కార్యదర్శిగా అజ్జు, ఎండీ సుల్తాన్, అన్వర్‌పాషా, మరో 20 మంది కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

లక్ష జనసమీకరణ చేస్తాం

అచ్చంపేట: పట్టణంలో గురువారం నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు లక్ష మంది వచ్చే విధంగా జనసమీకరణ చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలో సీఎం సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, మాజీ చైర్మన్ కె.తులసీరాం, అమీనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: అచ్చంపేటలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ నిర్మల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొల్లాపూర్: వీపనగండ్ల మండలం గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన పలువురు యువకులు, బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్ ఉన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

కొల్లాపూర్: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. బుధవారం కోడేరు మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన పలువురు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో చేరారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని వారి అవినీతిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

చంద్రసేన్‌గుప్తాకు నివాళి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ క్లబ్ భవనంలో ఆ క్లబ్ వ్యవస్థాపకుడు చంద్రసేన్‌గుప్త వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ చట్టంతో ప్రజలకు మేలు



కల్వకుర్తి: ఫార్మసీ చట్టంతో ప్రజలకు మేలు చేకూరుతుందని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల జిల్లా సంఘం అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సంజీవ్ రెడ్డికి మద్దతు ప్రకటించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకటాద్రి, శేకర్, శివ, యాదగిరి, స్వామి, కురుమయ్య, రాంబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై నిఘా

- రంగంలోకి స్పెషల్‌పార్టీ, టాస్క్‌ఫోర్స్, జిల్లా బృందాలు
- బెల్ట్ షాపులే లక్ష్యంగా దాడులు



బెల్ట్‌షాపులో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అచ్చంపేట రూరల్: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఓటర్లను వివిధ రాజకీయ పార్టీలు మద్యంతో ప్రలోభానికి గురి చేయకుండా ఉండేందుకు మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు నిఘా ఉంచారు. ఎక్సైజ్‌శాఖ స్పెషల్‌పార్టీ, టాస్క్‌ఫోర్స్, జిల్లా బృందాలు, స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారుల బృందాలు గ్రామాల్లో విస్తృతంగా దాడులు చేస్తున్నాయి. మద్యం దుకాణాల్లో నిబంధనల ప్రకారం మద్యం విక్రయిస్తున్నారా...? లేదా అని పరిశీలిస్తూనే బెల్టు షాపులపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తున్నారు. బెల్టుషాపులే లక్ష్యంగా బృందాలు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

మద్యం విక్రయాలపై నిఘా

ఎన్నికల కోడ్ రావడంతో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమంగా గ్రామాలకు మద్యం తరలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో ప్రతి రోజు జరుగుతున్న విక్రయాలపై నిఘా పెట్టారు. ఎక్కువ మొత్తంలో ఏ ప్రాంతానికైనా తరలిస్తున్నారా...? అని ప్రత్యేక నిఘా పెట్టారు. గ్రామాల్లో బెల్టు షాపులపై విస్తృతంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే సారా అమ్మకాలపై, తయారు చేసే బట్టీలను ధ్వంసం చేస్తున్నారు. అక్కడక్కడ సారా కాచి వివిధ గ్రామాలకు బైక్‌లపై తరలిస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచి పట్టుకుంటున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఎక్కడ కూడా మద్యం అక్రమంగా సరఫరా కాకుండా చూసేందుకు దాడులు ఎక్కువగా చేయాలని స్పెషల్‌పార్టీ, టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు భావిస్తున్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన ప్రత్యేక బృందాలతో పాటు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన నిఘా బృందాలు దాడులు చేస్తూ మద్యం అక్రమ రవాణాను నిరోధించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. దీంతో మద్యం అక్రమాలపై గట్టి నిఘా ఉంచారు.

ఇతర రాష్ట్రాల మద్యం డంపు

వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి మద్యంను గ్రామాలకు తరలించి డంప్ చేశారని వదంతులు విన్పిస్తున్నాయి. రాష్ట్రానికి సమీపంలో ఉన్న రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యంను తీసుకొచ్చారని మండలానికో డీసీఎం చొప్పున ఇప్పటికే మద్యం చేరుకుందని సమాచారం. ఎన్నికలు దగ్గర పడే సమయంలో మద్యంను బయటకు తీసుకొచ్చి ప్రజలకు పంచుతారని తెలుస్తోంది.

కేసుల నమోదు వివరాలు

ఈ నెల 9 నుంచి ఎన్నికల కోడ్ నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో అక్రమంగా మద్యం విక్రయాలు జరపకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు అక్రమంగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న మొత్తం 11 మందికి కేసులు నమోదు అయ్యాయి. 58.62 లీటర్ల విస్కీ, 66.81లీటర్ల బీర్లను పట్టుకున్నారు. నిషేధిత గుడుంబాను సరఫరా చేస్తున్న 16 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే 197 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 4920 లీటర్ల బెల్లం పానకంను పారబోశారు. 1940 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నారు. 5 వాహనాలను సీజ్ అయ్యాయి.

ఎవరినీ ఉపేక్షించం



అక్రమంగా మద్యం తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. మద్యం అమ్మకాలపై గట్టి నిఘా ఉంచాం. మద్యంను అక్రమంగా నిల్వ ఉంచినా, తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి.

– బాల్‌రాజు, ఎక్సైజ్ ఎస్ఐ, అచ్చంపేట

పటిష్ట నిఘా ఏర్పాటు..



అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సర్కిల్ పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నాం. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎన్నికల నియమావళి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– కృష్ణ, ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట

నేత్రపర్వంగా అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తిగీతాలను ఆలపిస్తూ పట్టణ వీధులలో ఊరేగిస్తూ ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు లడ్డూ, అమ్మవారికి అలంకరించిన చీరలను వేలం వేయగా రూ.10 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు పేర్కొన్నారు. లడ్డూను పట్టణానికి చెందిన ఈరమల్ల చంద్రయ్య రూ.1.56లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డినారాయణ రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌లు వేర్వేరుగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపునకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి జగదీశ్వర్, అదనపు కార్యదర్శి శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్, హరిషోరి దాండియా బృందం మహిళలు, భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట పదిరోజుల పాటు బతుకమ్మ పండుగ నిర్వహించారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా మహిళలు బతుకమ్మ పాటలకు అనుగుణంగా బొడ్డెమ్మలు ఆడారు. అనంతరం మండల కేంద్రంలోని గోపినేని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అలివేలమ్మ, జయమ్మ, స్వరూప, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలించేందుకు సిద్ధంగా ఉన్న బతుకమ్మలు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద దుర్గాదేవి మండపంలో చండీహోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంకాలం దుర్గాదేవి విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. శోభాయాత్రలో భక్తులు కోలాట ప్రదర్శనలు, బతుకమ్మ ఆడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారికి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎల్లికట్టలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి



మన్ననూర్‌లో ప్రచారం చేస్తున్న లోకనాథం

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్, ఎల్లికట్ట గ్రామాలలో ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకు ప్రచారం చేశారు. నియోజకవర్గ సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే పార్టీ మారానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిక

వెంకటాపూర్‌కు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ఎల్లికట్ట సర్పంచ్ రమాదేవి, మాజీ సర్పంచ్ రాకేశశర్మలతోపాటు ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పరిశీలనకు వచ్చిన జిల్లా నాయకుడు లోకనాథం బుధవారం మన్ననూర్‌లోని పాత బజార్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎంపీటీసీలు ఎంఏ రహీం, శ్రీనివాసులు, నాయకులు జయమ్మ, సైదులు, వెంకటయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, సుక్యానాయక్ ఉన్నారు.

లింగాల: మండలంలోని మగ్దూంపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు.

ఉప్పునుంతల: మండలంలోని పూర్యానాయక్ తండా, సీబీ తండాల్లో బుధవారం కాంగ్రెస్ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు తిర్పతయ్యగౌడ్, మొగిలి మహేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో చేరారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు తీగలపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో లింగారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన కాళ్ల కుర్మయ్య గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ శివారెడ్డి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు మాజీ మంత్రి ఆర్థికసాయం

కోడేరు: మండల కేంద్రానికి చెందిన యాపచెట్టు బాలస్వామి సోమవారం మృతి చెందాడు. గతంలో అతని భార్య కూడా చనిపోవడంతో పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనాథ పిల్లలను పరామర్శించి రూ.55వేల ఆర్థికసాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సింగిల్ విండో డైరెక్టర్ మహేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ కరీం, బాబు, సురేందర్‌రెడ్డి, సురేష్, మిద్దె రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి గ్రామానికి చెందిన డేరంగుల జంగయ్య, డేరంగుల శేఖర్ ఈ నెల 23న శమీపూజ పూజలో ఒకరికొకరు రాజకీయాలపై చర్చించుకుంటూ ఘర్షణ పడ్డారు. ఒకరిపైఒకరు దాడి చేసుకున్నారు. ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో బుధవారం వారు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గౌషియాబేగంకు కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. నడవలేని స్థితో ఉండటంతో వైద్య ఖర్చుల కోసం హెల్పింగ్‌హ్యాండ్స్ చేయూతనిచ్చింది. బుధవారం బాధితురాలిని పరామర్శించి రూ.45వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో విష్ణురెడ్డి, ఇంద్రారెడ్డి, అన్వేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మట్టి కలశాల సమీకరణ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి తీసుకొచ్చిన మట్టి కలశంలను ఎంపీడీఓ కోటేశ్వర్ సమీకరించారు. అనంతరం వాటిని జిల్లా యువజన అధికారి కోటానాయక్‌కు అందజేశారు. ఈ నెల 27న గవర్నర్ సమక్షంలో మట్టి కలషంలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో ఢిల్లీకి పంపి అక్కడ స్వాతంత్య్ర సమరయోధుల జ్ఞాపికకు ఏర్పాటు అవుతున్న ఉద్యానవనానికి మట్టిని వినియోగిస్తారని ఎంపీడీఓ వివరించారు. కార్యక్రమంలో వలంటరీలు పాల్గొన్నారు.



మట్టి కలశాలను తీసుకుంటున్న ఎంపీడీఓ కోటేశ్వర్

తక్షణమే కేసులు ఎత్తేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ

మన్ననూర్: ప్రమాదకరమైన కలుషితం వెదజల్లుతున్న చిత్తనూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ మూసివేయాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులపై, మహిళలపై, కూలీలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలని కుల నిర్మూలన వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలోని గ్రంథాలయంలో సమితి నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 15 మందిపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటూ పోలీసుల అదుపులో ఉన్న చంద్రశేఖర్, లక్ష్మయ్యలను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం, పోలీసుల విచక్షణారహితమైన దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు హాని కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీని అక్కడి నుంచి తొలగించి గ్రామంలో శాంతి యుత వాతావరణం కల్పించాలని కోరారు. ప్రజా వ్యతిరేక రాజకీయ నాయకులను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామన్నారు. సమావేశంలో నాయకులు పర్వతాలు, సుల్తాన్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాలలు




శిథిలావస్థకు చేరిన బాచారం పాఠశాల గదులు

పెచ్చులూడిన పైకప్పు

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- ఒకే గదిలో నాలుగు తరగతులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని ప్రాథమిక పాఠశాలలు బాచారం, పెద్దకొత్తపల్లి, చిన్నకార్పాముల, యాపట్ల, ముష్టిపల్లి, దేవినేనిపల్లిలో ఉన్నత పాఠశాల, ముష్టిపల్లి పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఒకే గదిలో రెండు మూడు తరగతుల పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలో 5632 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. వీటిలో 3432 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బాచారం పాఠశాల గదులు పైకప్పు పెచ్చులూడిపడడంతో ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో రెండు గదులు ఉండడంతో తరగతులను గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్య భవనాలలో విద్యా బోధన కొనసాగుతోంది. అధికారులు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూతన గదులు నిర్మించాలి



విద్యార్థులకు అనుగుణంగా నూతనంగా తరగతి గదులు నిర్మించాలి. బాచారం ప్రాథమిక పాఠశాలకు ఐదు తరగతులకు సరిపడా భవనాలను మంజూరు చేయాలి. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.

– శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ప్రాథమిక పాఠశాలలు బాచారం, పెద్దకొత్తపల్లి, చిన్నాకార్పాముల, యాపట్ల, దేవినేనిపల్లి, ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణాలు చేపడతాం.

– చంద్రుడు, ఎంఈఓ, పెద్దకొత్తపల్లి



పూజలు నిర్వహిస్తున్న కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

తెలకపల్లి: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భక్తిభావంతో సత్ప్రవర్తన, ఉన్నతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ఆయన వెంట నాయకులు మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, వెంకటయ్యగౌడ్, బల్చశ్రీరాములు, బాలగౌడ్, బిచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దైవంతో సమానం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

తెలకపల్లి: తల్లిదండ్రులు దైవంతో సమానమని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, యోగా గురువు రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కల్యాణ మండపంలో యోగా గురువు ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తల్లిదండ్రులకు పిల్లలు పాదాలు కడిగి పాదపూజ చేశారు. ఎవరు కూడా తల్లిదండ్రులను అశ్రద్ధ చేయొద్దన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను యువత కాపాడుకోవాలని వారు పేర్కొన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని వారు వివరించారు.